



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు



సాగని ఈకేవైసీ

- ఈ నెలాఖరు వరకే గడువు
- రేషన్‌దారులకు తప్పని తిప్పలు

ప్రభుత్వం రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ-కెవైసి తప్పనిసరి చేసింది. ఈ-కెవైసి పెండింగ్ ఉన్న వారికి రేషన్‌దుకాణాల్లో ఆ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా ముందుకు సాగడం లేదు. ఈ నెలాఖరు వరకే గడువు ఉండటంతో రేషన్‌దారులకు తిప్పలు తప్పడం లేదు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రేషన్‌కార్డులో ఉన్న సభ్యులందరికీ ఈకెవైసి పూర్తి చేసే ప్రక్రియ మందగమనంగా సాగుతోంది. కుటుంబ యజమానితో పాటు కార్డులో సభ్యులుగా ఉన్న వారందరికి తప్పని సరిగా చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడంతో గత నెల రోజులుగా ఈ ప్రక్రియను జిల్లా పౌర సరఫరా శాఖ అధికారులు చేపట్టారు.

6 నుంచి 79 ఏళ్లలోపు..

జిల్లాలో ఇప్పటి వరకు రేషన్ తీసుకునే సమయంలో బయోమెట్రిక్ వేసిన ఎక్కువ మందికి ఈకేవైసీతో పనిలేకుండా పోయింది. కార్డుల్లో సభ్యులుగా ఉండి స్థానికంగా ఉండని వారు, వేర్వేరు ప్రాంతాల్లో నివశిస్తూ ఉద్యోగ, వ్యాపారాల్లో నిమగ్నమయ్యే వారు ఈకేవైసి చేసేందుకు రాలేకపోతున్నారని అధికారులు చెబుతున్నారు. ఈకేవైసీ పూర్తయిన తరువాత కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభిస్తారని అధికారులు చెబుతు న్నారు. ప్రధానంగా కార్డు దారులల్లో కుటుంబ విభజన ప్రక్రియను కూడా ప్రారంభిస్తారు. ప్రస్తుత కార్డులో ఉన్న సభ్యులంతా ఈకెవైసి పూర్తి చేస్తేనే వారు సభ్యులుగా కొనసాగుతారని లేదంటే వారిని తొలగించాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. వీలైనంత వరకు కార్డు దారులను కలిసి వారి కుటుంబంలో పెండింగ్లో ఉన్న వారి చేత ఈకేవైసీ చేయించుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఒకటి నుంచి ఐదేళ్ల లోపు వారికి, 80 ఏళ్లు దాటిన వారికి ఈకేవైసీ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఆరు నుంచి 79 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు ఈకేవైసీ చేయాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చింది.

కర్నూలు జిల్లాలో 6,76,209 లక్షల రేషన్‌కార్డులు ఉండగా వాటిలో మొత్తం 21,92,047 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారిలో 19,56,826 మంది ఈ-కెవైసికి చేసుకున్నారు. ఇంకా 1,82,991 మంది ఈ కెవైసి పెండింగ్‌లో ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5,41,804 రేషన్‌కార్డులు ఉండగా వాటిలో15,77,936 మంది లబ్ధిదారులు ఉన్నారు. వాటిలో 14,35,229 మంది ఈ కెవైసి చేయించుకున్నారు. ఇంకా 1,05,153 మంది ఈ కెవైసి పెండింగ్‌లో ఉంది. పెండింగ్‌లో ఉన్న వారి ఈ కెవైసి పూర్తి చేసే ప్రక్రియను రేషన్ డీలర్లకు పౌరసరఫరాల శాఖ అప్పగించింది. ఇకెవైసి ప్రక్రియను గత మార్చి నెల ఆఖరికే పూర్తి చేయాలని భావించినప్పటికీ మరో నెల పాటు గడువు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా రేషన్ కార్డు దార్ల ఇకెవైసి ప్రక్రియను రేషన్ డీలర్లు చేస్తున్నారు. ఇప్పుడు గత నెల రోజులుగా రేషన్ డీలర్లు ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. రేషన్ డీలర్ల వద్ద, లేదా ఎండియు వాహనాల ఆపరేటర్ వద్ద ఈ-పోస్‌లో కానీ ఈకేవైసిగాని చేయవచ్చునని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు అధికారులు అన్ని మండలాల అధికారులు అప్రమత్తం చేసింది. పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్లు ఈ ప్రక్రియను పర్యవేక్షణ చేస్తున్నారు.

డబ్బులు వసూలు

కొన్నిచోట్ల రేషన్ డీలర్లు కార్డుదారుల నుండి డబ్బులు కూడా వసూలు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇకెవైసిపి చేయించుకోకపోతే ప్రభుత్వ పథకాలు అందవని డీలర్లు కార్డుదారులను బెదిరిస్తూ అక్రమంగా డబ్బులను వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

తెర మీదకు నగదు బదిలీ

రేషన్ కార్డుదారులకు రాబోయే రోజుల్లో నగదు బదిలీ పథకాన్ని అమలు చేసేందుకే ఇకెవైసి విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తెరమీదకి తెచ్చినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం కారిదారులకు బియ్యం సరఫరా చేస్తుండగా రాబోయే రోజుల్లో దానికి బదులు నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలని ఉద్దేశంతోనే ఈ ప్రక్రియను చర్యలు తీసుకుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కార్డుదారులకు ఇస్తున్న బియ్యానికి నగదును నేరుగా కేంద్ర ప్రభుత్వం నగదు బదిలీ పథకం ద్వారా అందజేసేందుకుగాను దృష్టి సారిస్తోంది. కార్డుదారుల వివరాలన్నిటిని పక్కాగా చేసుకుని వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు జమ చేసేలా చర్యలు చర్యలు చేపడుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. రాబోయే కాలంలో కార్డుదారులకు ఉచితంగా బియ్యం ఇతర నిత్యవసర సరుకులను అందజేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేతులెత్తేస్తారు.

పెండింగ్ ఉన్న వారు ఈకేవైసీ చేసుకోవాలి

జిల్లాలోని రేషన్ కార్డుదారుల్లో ఈకేవైసీ పెండింగ్ ఉన్న వారు వెంటనే చేసుకోవాలి. జిల్లాలో ఇంకా 1,82,991 మంది ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంది. నేరుగా రేషన్ షాపుల్లో గానీ, ఎండియు ఆపరేటర్ల వద్ద గానీ ఈకేవైసీ చేసుకోవాలి.

- రాజా రఘువీర్ వీర్, జిల్లా పౌర సరఫరాల అధికారి

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులపాటు పర్యటన నిమిత్తం, పిన్నాపురం ప్రాజెక్ట్ సైట్, గ్రీన్ కో ప్రాజెక్టును పరిశీలించేందుకు గురువారం సాయంత్రం కర్నూలు ఓర్వకల్లు ఎయిర్పోర్టుకు చేరుకున్న కేంద్ర కన్స్యూమర్స్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, న్యూ,అండ్ రెన్యువబుల్ ఎనర్జీ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఘనంగా స్వాగతం పలికారు. కర్నూలు, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే, గౌరు చరిత రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్, కర్నూలు ఎస్‌పి విక్రాంత్ పాటిల్, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పుష్ప గుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం కర్నూలు మౌర్యఇన్ హోటల్‌కు చేరిన కేంద్ర మంత్రికి జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పుష్పగుచ్చం అందజేసి మర్యాద మూర్వకంగా స్వాగతం పలికారు.

ప్రగతి కార్డులను 21నాటికి అందించాలి

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్



మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య


జిల్లాలోని విద్యార్థులకు మార్కులతో కూడిన ప్రగతి కార్డులను 21వ తేదీ నాటికి అందించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం పాఠశాలల ముగింపునకు వెబెక్స్ ద్వారా సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులకు మార్కులతో కూడిన ప్రగతి కార్డులను 21వ తేదీ నాటికి అందించి ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలన్నారు. పైతరగతులకు చేర్చే ప్రక్రియ పూర్తిచేసి సోమవారం కొత్త తరగతుల్లో కూర్చునే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. పాఠశాల ఆవశ్యకత, విద్యా ప్రమాణాల గురించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈ ప్రక్రియ ఒకటి నుండి 10వ తరగతి వరకు అన్ని తరగతులవరకు జరిగేలా చూడాలని జెసి ఆదేశించారు..జిల్లా వ్యాప్తంగా 4,21,632 విద్యార్థులు పైతరగతులకు వెళ్తున్నందున వారందరికీ స్కూలు ప్రత్యేకతలను తెలియజేయాలన్నారు.. జిల్లా వ్యాప్తంగా 1886 అంగన్వాడి కేంద్రాల నుండి పూర్వ ప్రాథమిక విద్యను పూర్తిచేసుకుని ప్రాథమిక విద్యలోకి చేరుతున్నందున వారందరూ మన పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే మూడు రోజులు అనగా 21, 22, 23 తేదీలలో విద్యార్థులు కొత్త తరగతుల్లోకి మారేలా సంబంధిత అన్నీ స్థాయిలలోని విద్యాశాఖాధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శ్యామ్యూల్ పాల్ , జిల్లా లోని కానిస్టిట్యూయెన్సీ లెవెల్ ఆఫీసర్స్, మండల్ స్పెషల్ ఆఫీసర్స్ , సిడిపిఒలు, జడ్‌పి సిఇఒ, డిప్యూటీ డిఇఒలు, మండల విద్యాధికారులు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానో పాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిఇ ఫీజు బకాయి రూ 1.50 కోట్లు

- నిధులు విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- ఫీజులను చెల్లించిన తల్లిదండ్రులు
- మళ్లీ ఉచిత ప్రవేశాలకు విద్యాశాఖ చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉచిత నిర్బంధ విద్య చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఫీజుల చెల్లింపునకు నిధులను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విడుదల చేయలేదు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజుల బకాయిలు దాదాపుగా రూ.1.50 కోట్లకు పైగానే పెండింగులో ఉన్నాయి. ఫీజులు కట్టకపోతే విద్యాబోధన చేయలేమని విద్యార్థుల తల్లిదండ్రులపై యాజమాన్యాలు ఒత్తిడి చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులే ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోయినా నేరుగా ఫీజులను పాఠశాల యాజమాన్యాలకు చెల్లించారు. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం...



తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం పేదలకు ఉచిత అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు విద్యాశాఖ చర్యలు తీసుకోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద ప్రయివేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లను పేదలకు కల్పించాల్సి ఉంటుంది. ఈలెక్కన ప్రయివేటు పాఠశాల యాజమాన్యాలకు పట్టణ ప్రాంతాల్లో ఒక్కో విద్యార్థికి రూ.8000, గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో విద్యార్థికి రూ.6500 గిరిజన ప్రాంతాల్లో ఒక్కో విద్యార్థికి రూ 5100 చొప్పున ఫీజులను చెల్లిస్తారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న అమ్మ ఒడి కింద వచ్చిన డబ్బులను పాఠశాల యాజమాన్యాలకు నేరుగా తల్లిదండ్రులు చెల్లించేవారు. జిల్లాలో 3322 అడ్మిషన్లకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు అనుమతించారు. 2353 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొంది ఉన్నారు. మిగిలిన 979 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందలేకపోయారు.

ఫీజుల చెల్లింపునకు యాజమాన్యాలు ఒత్తిడి

విద్యాహక్కు చట్టం కింద అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదు. జిల్లాలో దాదాపుగా రూ.1.50 కోట్లకు పైగా నిధులను విడుదల చేయాల్సి ఉంది. గతంలో అమ్మ ఒడి కింద వచ్చిన నిధులను నేరుగా పాఠశాల యాజమాన్యాలకు తల్లిదండ్రులు చెల్లించేవారు. ఈ ప్రభుత్వం నిధుల విడుదలకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొన్నిచోట్ల విద్యార్థులు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులకు బోధన చేయలేమని తల్లిదండ్రులకు చెప్పేశారు. విద్యాబోధన చేయాలంటే ఫీజులు కడితేనే చేస్తామని చెప్పడంతో విధిలేక నేరుగా ఫీజులను చెల్లించేశారు. ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లను పొందేందుకు ఈనెల 28 నుండి దరఖాస్తులను స్వీకరించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఒకటో తరగతిలో అడ్మిషన్లు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకుంది. అందుగ్గాను అన్ని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- రంగప్ప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎఫ్ఐ



ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలి. విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లను తప్పనిసరిగా కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఫీజుల చెల్లింపుకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులకు సంబంధం లేకుండా నేరుగా ప్రభుత్వమే చెల్లించాలి.

ఫీజులు చెల్లించాలని ఒత్తిడి

- రాము విద్యార్థి తండ్రి



నగరంలోని బి.తాండ్రపాడు సమీపంలో ఉన్న క్రీడో పాఠశాలలో తన కుమారుడు మంద సాత్విక్ ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద గత విద్యా సంవత్సరం అడ్మిషన్ పొందాడు. రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో పాఠశాల యాజమాన్యం ఫీజు రూ.27 వేలు చెల్లించాలని ఒత్తిడి చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే తానే ఫీజు చెల్లిస్తామని పాఠశాల యాజమాన్యానికి విన్నవించుకున్నాడు. విడుదల చేయకపోవడంతో పాఠశాల యాజమాన్యం ఫీజులు చెల్లించాలని అడుగుతున్నారు. తల్లికి వందనం నిధులను త్వరగా విడుదల చేస్తే వెంటనే ఫీజులను చెల్లించుకునేందుకు అవకాశం ఉంటుంది.

విద్యాబోధనకు ఆటంకం లేకుండా చర్యలు

- ఎస్.శామ్యూల్ పాల్ డిఇఒ

ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు విద్యాబోధనకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవడం జరిగింది. తల్లికి వందనం నిధులు విడుదల కాగానే నేరుగా విద్యార్థులు తల్లిదండ్రులు ఫీజులను చెల్లించాలి



తహశీల్దార్‌కు సిపిఎం వినతి పత్రం ఇస్తున్న జి.రామకృష్ణ, నాగన్న

పేదలకు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలి

తహశీల్దార్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న పేదలకు పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఓర్వకల్ తహశీల్దార్ విద్యాసాగర్‌కు జి. రామకృష్ణ , సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత 15 నుంచి 20 సంవత్సరాలుగా పేదలు మండలంలోని అనేక గ్రామాలలో కాల్వ, కొమరోలు, లొద్దిపల్లె కేతవరం ఇతర గ్రామాలలో ప్రభుత్వ భూములను సాగు చేస్తున్నారన్నారు. వారు అనేకసార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప పేద బడుగు బలహీన వర్గాలకు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేయడం లేదన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. మండలంలో ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న పేదల వివరాలను సేకరించి వెంటనే పాస్ పుస్తకాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు లేకపోతే పేదలతో కలిసి తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.బషీర్, రోకాభి లక్ష్మీదేవి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారుజ

పంచాయతీరాజ్ ఎఇపై సర్పంచుల ఆగ్రహం

ప్రజాశక్తి మద్దికేర



గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులను పంచాయ తీరాజ్ ఎఇ ఎలాంటి తీర్మానాలు లేకుండా చేస్తున్నారని అగ్రహారం విజయుడు, పెరవలి సర్పంచి మల్లికార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎంపిపి అనిత యాదవ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు తీర్మానాలు లేకుండానే, పంచాయతి రాజ్ ఎఇ అభివృద్ధి పనులు ఎలా చేయిస్తాడని సర్పంచులు ప్రశ్నించారు. పనులు పూర్తయిన తర్వాత తీర్మానం ఇవ్వాలని, తమ దగ్గరకు వస్తే ఎలాగని మండిపడ్డారు. ఎంపిడిఒ జోక్యం చేసుకొని భవిష్యత్తులో ఇలా జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖ ఎఇ ఎలాంటి అనుమతులు లేకుండా మండల సర్వసభ్య సమావేశంకు రాకపోవడంతో ఎంపిడిఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశానికి కూడా విద్యుత్ ఎఇ గైర్హాజరయ్యారని అన్నారు. భవిష్యత్తులో ఇలా జరిగితే కలెక్టర్ కు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆర్అండ్‌బి అధికారులు కూడా సక్రమంగా హాజరు కావడం లేదన్నారు. భవిష్యత్తులో ఏ అధికారయినా అనుమతులు లేకుండా, సమావేశానికి గైర్హాజరయితే, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందన్నారు. ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలి

వక్ఫ్ పరిరక్షణ సమితి నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న వక్ఫ్ పరిరక్షణ సమితి నాయకులు

కేంద్ర బిజెపి నాయకత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలని ముస్లిం జెఎసి నాయకులు డి.అబ్దుల్ దేశాయ్, ఎంఎ.హమీద్, టిఎస్.మునీర్ అహ్మద్‌లు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని రెండవ, మూడవ వార్డులోని ప్రాంతాలలోని వీధులలో కార్నర్ మీటింగ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్నర్ మీటింగులకు ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం నాయకులు డి.అబ్దుల్ దేశాయ్, ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ నాయకులు, ఎంఎ. హమీద్, జమాతే ఇస్లాం యే హింద్ జిల్లా నాయకులు పిఎస్. మునీర్ అహమద్‌లు ప్రసంగించారు. సిపిఎం నగర నాయకులు ఎస్ఎండి షరీఫ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ డైరెక్షన్‌లో ఈచట్టాన్ని బిజెపి ప్రభుత్వం తెచ్చిందన్నారు. ముస్లింల మదరసాలను, ఖబరాస్థాన్లను, మసీదులను , వక్ఫ్ఆస్తులను తమ వాళ్ళ కు కట్టబెట్టాలని ఈ చట్టాన్ని తెచ్చారని వారు విమర్శించారు. చట్టసవరణను మేధావులు, అనేకమంది రాజకీయ నాయకులు విమర్శిస్తున్నప్పటికీ, వ్యతిరేకిస్తున్నప్పటికీ తమ మంద బలాన్ని ఉపయోగించుకొని చట్టాన్ని పాస్ చేయించిందని వారు దుయ్యబట్టారు. తక్షణమే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని లేకపోతే ప్రజలందరిని సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షేక్షా వలి, చాంద్‌పాషా, షాషావలి, గిరి, మూసా ఇలియాస్, ఫిలాప్, గౌస్ బాషా, ఖలీల్ ,మాలిక్ , తదితరులు పాల్గొన్నారు.

మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు

మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం సిఐటియు కర్నూలు న్యూ సిటీ కమిటీ ఆల్ ట్రేడ్ యూనియన్స్ విస్తృతస్థాయి సమావేశం కార్మిక కర్షక భవన్ నిర్వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు సమావేశానికి అధ్యక్షత వహించారు. ఎండి.అంజిబాబు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, నగర కార్యదర్శి సిహెచ్.సాయి బాబా, టి. రాముడు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మిక వాడల్లో, నివాస ప్రాంతాల్లో కార్మికులను ఉల్లాసం, ఉత్తేజ పరచడానికి ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, సభలు సమావేశాలు జరిపి, క్రీడలలో పాల్గొన్న వారికి బహుమతుల ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మే నెల ఒకటి నుంచి 7 వరకు కర్నూలు నగరంలో న్యూ సిటీ కమిటీ పరిధిలో 12 ప్రాంతాల్లో కార్మికఉత్సవాలు నిర్వహించాలన్నారు. మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు, కరెంటు చార్జీలు తగ్గించాలని స్టిక్కర్లను ప్రతి కార్మికుడి ఇంటికి వేసుకుని నిరసన తెలపాలని రాష్ట్రకమిటీ పిలుపు ఇచ్చిందన్నారు. కార్మికుల ఇండ్లపక్కన ఉన్న ప్రజలను చైతన్యం చేసి వారి ఇళ్ళ కూడా స్మార్ట్ మీటర్ల వద్దు అనే స్టిక్కర్లను వేసుకునే విధంగా చైతన్యం చేయాలన్నారు. ఇది ఒక ఉద్యమం వలే జరగాలన్నారు. కార్మికుల హక్కులు కాపాడుకోవడం కోసం, పని భద్రత, సమాన పనికి సమాన వేతనం, కార్మికుల హక్కుల కోసం కేంద్ర, రాష్ట్ర, కార్మిక సంఘాలు కలిసి కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేసే విధంగా మే 20న దేశవ్యాప్త సమ్మె జరగబోతుందన్నారు. మే నెల ఒకటిన ఉదయం అన్ని కార్మికవాడల్లో జెండావిష్కరణలు చేసుకొని, 10 గంటలకు బళ్లారి చౌరస్తా నుండి భారీ కార్మిక ప్రదర్శన, కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న మార్కెట్ యార్డులో మేడే సభ నిర్వహించబోతున్నామన్నారు. ఈ సభలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సిఐటియు నగర నాయకులు కె.ప్రభాకర్, ఎస్ఎండి. మహమ్మద్ రఫీ, కె.సుధా కరప్ప, ఎస్.హుస్సేన్‌వలి, ట్రేడ్ యూనియన్స్ నాయకులు ఎం.మల్లికార్జున , విష్ణుమూర్తి, దస్తగిరి, హనుమంతు, సంజీవ, కోటేశ్వర్, గోవిందు, జమ్మన్న, రామచంద్రుడు, వెంకటేశ్వర్లు, నాగరాజు, సురేష్, దేవరాజు, మళ్లీ, నబీ మొదలగు వారు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన వైసిపి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



వక్ఫ్ సవరణ చట్టం 2025పై సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను వైసిపి మాజీ ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్ ఖాన్ స్వాగతించారు. కర్నూలు రాయల్ ఫంక్షన్ హాల్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈ చట్టంపై వైసిపి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై సానుకూల స్పందన వచ్చిందని అన్నారు. వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపిందని, వక్ఫ్ ఆస్తులు, నియామకాలపై సుప్రీంకోర్టు స్టేటస్ కో విధించిందన్నారు. తదుపరి విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసిందన్నారు. ఈ చట్టం ముస్లిం సమాజానికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు విరుద్ధమని అన్నారు. టిడిపి స్వార్థ రాజకీయాల కోసం ముస్లిం, మైనార్టీలను అన్యాయం చేసిందని హఫీజ్ ఖాన్ విమర్శించారు. ముస్లిం, మైనార్టీల పక్షాన నిలబడాలని టిడిపిని ఆయన డిమాండ్ చేశారు. ఎన్‌డిఎ నుంచి బయటికి రావాలని చంద్రబాబును కోరారు. సుప్రీంకోర్టు సిజెఐ లేవనెత్తిన ప్రశ్నలే మేం ముందు నుంచి అడిగామన్నారు. టిడిపి తడిగుడ్డతో మా ముస్లిం, మైనార్టీల గొంతు కోసిందన్నారు. చంద్రబాబు, నితీష్ కుమార్ బిజెపి అజెండాను అమలు చేశారన్నారు.

మైపర్ యాజమాన్యాన్ని అభినందించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



కర్నూలు న గరం లోని ఏ క్యాంప్‌లోని మైపర్ ఫార్మసి కళాశాల యాజమాన్యం ట్రాఫిక్ అవేర్నెస్ కోసం 10 బార్కెట్స్ పోలీసు వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మైపర్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. సామాజిక బాధ్యత గా సామాజిక కార్యక్రమంలో పాల్గొన్నందుకు యాజమాన్యాన్ని అభినందించారు. డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ హర్షం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. మహాలక్ష్మి, డాక్టర్ కాసర్ల సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పంచాయతీ' పనులను డిఇ తనిఖీ

ప్రజాశక్తి -సి బెళగల్



పనులను తనిఖీ చేస్తున్న డిఇ కర్రెన్న

సి బెళగల్ లో మండల పరిషత్ కార్యాలయం ముందు ప్రభుత్వ నిధులు వెచ్చించి నిర్మిస్తున్న పంచాయతీ దుకాణ సముదాయాన్ని, వాటి పనులను కోడుమూరు డివిజన్ డిఇ కర్రెన్న తనిఖీ చేశారు. గురువారం సి బెళగల్ పరిషత్ కార్యాలయంలో సంబంధించిన అసిస్టెంట్ ఇంజినీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భవనాలు, సిసి రోడ్లు, డ్రైనేజి ఇతర పనులు చేపట్టినచో నాణ్యతతో నిర్మించాలని సూచించారు. పిఆర్ ఎఇ వెంకటప్రకాష్ పాల్గొన్నారు.

రజియాబీ కుటుంబాన్ని ఆదుకోవాలి

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి



మృతురాలి బంధువులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పిడుగుపాటుకు గురై మృతి చెందిన రజియాబీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే బి.విరుపాక్షి డిమాండ్ చేశారు. గురువారం రజియాబీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించిన నేపథ్యంలో రజియాబీ భర్తను, బంధువులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. రోజూ కూలికి పోతే తప్ప జీవనం గడవని కుటుంబమని, ప్రభుత్వం రూ.10 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. వివాహాలు కాని కుమార్తెలు ఉన్నారని, ఉన్నతాధికారులు స్పందించి సమాచారాన్ని ప్రభుత్వానికి అందించి ఆదుకునేటట్లు కృషి చేయాలని కోరారు. సర్పంచి వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు సేనాపతి ఉన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న 'కూటమి'

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం నిర్ణయం హర్షణీయమని టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య తెలిపారు. గురువారం గోతులదొడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిని ఎస్సీలందరూ స్వాగతిస్తున్నారని, సమాజానికి మేలు చేసేలా ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని టిడిపి ఎస్సీ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మాల, మాదిగలందరికీ సమాన హక్కులు, న్యాయం చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళ్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు అన్ని ఫలాలూ అందించాలన్నదే చంద్రబాబు లక్ష్యమని చెప్పారు. ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయమని తెలిపారు. ముకేష్, సన్నప్ప, పురుషోత్తమ, రామాంజినేయులు, ముత్తన్న, చిన్న, బసవరాజు, అంబరేష్, పట్టాభి, లక్కే గోవిందు, కురువ నాగేష్, మహంతేష్ పాల్గొన్నారు.

వైభవంగా భంభం స్వామి ఉరుసు

ప్రజాశక్తి - చిప్పగిరి



స్వాముల వారిని దర్శించుకుంటున్న భక్తులు

చిప్పగిరిలోని భంభం సాహెబ్ ఉరుసు వైభవంగా నిర్వహించారు. గురువారం డాక్టర్ సయ్యద్ ఆరిపుద్దీన్ హమ్సు ఖాద్రీ ఆధ్వర్యంలో ఉరుసు షంషీరు ప్రతిమను గుర్రంపై ఉంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. దర్గా స్థలదాత గొల్ల రంగప్ప ఇంటి వరకు షంషీర్ ఉత్సవం కొనసాగించారు. మార్గమధ్యంలో వేలాదిమంది భక్తులు పాల్గొని షంషీర్ ఉత్సవాన్ని తిలకించారు. సలాములు ఫాతేహాలు జరిపి చదివింపులు నిర్వహించారు. ఎమ్మెల్యే విరుపాక్షి, సర్పంచి గోవిందరాజులు, ఎంపిటిసి సభ్యులు ఎల్లంకి రజిని, బర్మే సుమలత, టిడిపి, వైసిపి నాయకులు పాల్గొన్నారు. దర్గా ఆవరణలో కొట్టం నారాయణస్వామి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పూలమాలలు వేసి స్వామిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు భంభం బాబా దర్గాలో ప్రార్థనలు చేశారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - నందవరం

మాచాపురం గ్రామంలో గత నెలలో మరణించిన హనుమంత రెడ్డి కుటుంబాన్ని జనసేన పార్టీ ఇన్‌ఛార్జీ రేఖగౌడ్ పరామర్శించారు. గురువారం ఆమె మృతుని నివాసానికి చేరుకొని హనుమంతరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హనుమంత రెడ్డి కుమారుడు, జనసేన పార్టీ సానుభూతిపరులు నరసింహారెడ్డికి, కుటుంబ సభ్యులకు ఆమె మనోధైర్యాన్ని నింపారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఎల్లప్ప పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు అవకాశం కల్పించాలి

- సిఐటియు వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

60 ఏళ్లు నిండిన మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు పిల్లలకు వారసత్వ ఉద్యోగాలు కల్పించి గ్రాట్యుటీ, పింఛను సౌకర్యం కల్పించాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ మున్సిపల్ సెక్షన్‌లో పారిశుధ్య కార్మికులు, ఇంజినీర్ కార్మికులు ఏళ్ల తరబడి ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్మికులందరినీ 62 ఏళ్లు కొనసాగిస్తున్నారని, కానీ మున్సిపల్ సెక్షన్‌లో మాత్రం కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం 60 ఏళ్లు పూర్తయిన కార్మికులను వారసత్వ ఉద్యోగాలు కల్పించకుండా గ్రాట్యుటీ, పింఛను సౌకర్యం కల్పించకుండా ఖాళీ చేతులతో ఇంటికి పంపించాలని తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, 62 ఏళ్ల సర్వీసును మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి 60 ఏళ్లు పూర్తయిన పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని, వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని తెలిపారు. గ్రాట్యుటీ, పింఛను సౌకర్యం కల్పించాలని, కరోనా సమయంలో అనారోగ్య కారణాల వల్ల మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, పారిశుధ్య సెక్షన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జె.నాగరాజు, కె.ఇస్మాయిల్, బి.మునీంద్ర, బి.కేశన్న, కె.ఖాజా, బి.రంగస్వామి, కె.సాల్మన్ పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారికి వినతి పత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు



స్వాధీనం చేసుకున్న బైక్, మద్యాన్ని చూపుతున్న సిఐ

అక్రమ మద్యం రవాణా చేస్తే కేసులే : సిఐ సైదుల్

ప్రజాశక్తి - ఆదోని

ఇతర రాష్ట్రాల మద్యాన్ని రవాణా చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ హెచ్చరించారు. గురువారం స్వాధీనం చేసుకున్న మద్యాన్ని, బైక్‌ను పోలీసు స్టేషన్‌లో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్ణాటక మద్యాన్ని సరఫరా చేస్తూ కొందరు ఆదాయ వనరుగా చూసుకుంటున్నారని, పద్ధతి మార్చుకోకపోతే అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కర్ణాటక మద్యం కలిగి ఉన్న పెసలబండ గ్రామానికి చెందిన నర్సారెడ్డి, కపటి గ్రామానికి చెందిన ఈడిగ హరిచంద్రను అరెస్టు చేసి వారి వద్ద 192 కర్ణాటక టెట్రా పాకెట్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మద్యం సరఫరా చేసిన పెసలబండ గ్రామానికి చెందిన గిడ్డయ్యపై కేసు నమోదు చేశామన్నారు. నాటుసారాను సమూలంగా నిర్మూలించేందుకు నవోదయ 2.0 కార్యక్రమం కింద ఇప్పటికే క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తూ ప్రవర్తన మార్చుకోవాలని వివరిస్తున్నామన్నారు.

నాణ్యత ఉంటేనే బిల్లులు

- పంచాయతీరాజ్ అధికారులు

ప్రజాశక్తి - హొళగుంద

సిసి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేసి నిర్మిస్తేనే వాటికి బిల్లులు పెడతామని పంచాయతీరాజ్ ఎఇ సోమప్ప, క్వాలిటీ కంట్రోల్ అధికారులు తెలిపారు. గురువారం మండలంలోని అర్థగేరి, బేవినహాల్ గ్రామాల్లో సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాసిరకం పనులు నిర్మిస్తే ఉపేక్షించబోమని తెలిపారు. నాణ్యతలో అన్ని నియమాలూ పాటించి నిర్మించినప్పుడే వాటికి బిల్లులు పెడతామని కాంట్రాక్టు దారులకు తెలిపారు. నాణ్యతకు పెద్దపీట వేసినప్పుడే సిసి రోడ్డు నిర్మాణాలు 10 కాలాలపాటు ఉంటాయన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

వ్యవసాయంలో నూతన పద్ధతులు అవలంభించాలి

- ఎఒ జయలక్ష్మి

ప్రజాశక్తి - చిప్పగిరి

వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు పొందాలంటే నూతన పద్ధతులను అవలంభించాలని ఎఒ జయలక్ష్మి రైతులకు సూచించారు. నీళ్ల మందులు పిచికారి చేసే హోండా స్ప్రేయర్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం చిప్పగిరి రైతు సేవా కార్యాలయంలో ఎఒ జయలక్ష్మి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల రైతు సేవా కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే అగ్రికల్చర్ అసిస్టెంట్ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని రామదుర్గం, నేమకల్లు, ఏరూరు, దౌల్తాపురం, నగరడోనా గ్రామాలకు చెందిన రైతులకు ఏడు హోండా స్ప్రేయర్లు, రెండు బ్యాటరీ స్ప్రేయర్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులకు ఉపయోగపడే పరికరాల కోసం ఆయా రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అగ్రికల్చర్ అధికారులు జ్యోతిర్మయి, సుబ్బరాయుడు, వంశీ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.



స్ప్రేయర్లను రైతులకు పంపిణీ చేస్తున్న ఎఒ జయలక్ష్మి

వైసిపిని వీడే ప్రసక్తే లేదు..!

- కౌన్సిలర్‌గానే కొనసాగుతా

- మున్సిపల్ మాజీ ఛైర్మన్ శాంత

ప్రజాశక్తి - ఆదోని



వైసిపిని వీడే ప్రసక్తే లేదని, కౌన్సిలర్‌గా కొనసాగి ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ మాజీ ఛైర్మన్ బోయ శాంత తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాను ఏ రోజూ పదవి కోసం పాకులాడలేదని, ప్రజల కోసం పనిచేయాలని వచ్చానని తెలిపారు. తనకు ఛైర్మన్ పదవి లేకున్నా కౌన్సిలర్ పదవితోనే ప్రజలకు సేవ చేస్తానని, తనకు జరిగిన అన్యాయంపై భవిష్యత్తులో మాట్లాడతానని, అన్ని విషయాలూ చెబుతానని అన్నారు. తనకు ఛైర్మన్‌గా గత నాలుగేళ్ల ఒక నెలరోజుల పాటు కొనసాగేందుకు ఎంపిక చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, తనకు సహకరించిన మున్సిపల్ కౌన్సిలర్లకు, సహకరించని కౌన్సిలర్లకూ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మున్సిపల్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, పత్రిక విలేకరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనను ఈ పదవిలో ఉండేందుకు గెలిపించిన పట్టణ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కొత్తగా వస్తున్న ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఛైర్మన్ బలపరీక్షకు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నిస్తే.. ఇక తన పని ఏముందని వెళ్లలేదని స్పష్టం చేశారు. వైసిపిలో గెలుపొంది విప్ ధిక్కరించిన విషయాన్ని ప్రస్తావించగా కౌన్సిలర్ కూడా తనకు వద్దని వైసిపి అధిష్టానం నిర్ణయిస్తే ఇంట్లో ఉంటానని, అంతే తప్ప పార్టీ మారబోనని తెలిపారు. భవిష్యత్తులో ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారని ప్రశ్నిస్తే.. అప్పుడు చూద్దామని అన్నారు. 'మీకు అండగా ఎమ్మెల్యే పార్థసారథి ప్రెస్ మీట్ ఇచ్చార'ని వివరిస్తే అది వారి ఇష్టమని, తనకు తెలియదని సమాధానం దాటవేశారు.

నిర్దిష్టమైన జాబ్ చార్ట్ కల్పించాలి : సిహెచ్‌ఒలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నిర్దిష్టమైన జాబ్ చార్ట్ వెంటనే కల్పించాలని సిహెచ్‌ఒలు డిమాండ్ చేశారు. ఎపి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్స్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో వైద్యసేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, సిహెచ్‌ఒల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఎపిఎంసిఎ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పెద్దతుంబలం, పెద్దహరివాణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిహెచ్‌ఒ, ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లు శాంతియుతంగా నిరసన చేపట్టారు. గత ఆరేళ్లుగా సిహెచ్‌ఒలు ఎదుర్కొంటున్న సమస్యలను, వివక్షను తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఎపిఎంసిఎ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ నాగరాజు మాట్లాడుతూ... న్యాయంగా తమకు రావాల్సిన పెండింగ్ ప్రోత్సాహకాలు, 23 శాతం హైక్, ఈపీఎఫ్ పునరుద్ధరణ, ఆయుష్మాన్ భారత్ నియమాల ప్రకారం సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేయడం, ఫిక్స్‌డ్ పే, హెల్త్ పాలసీ, అద్దె బకాయిలు చెల్లించాలని కోరారు. సిహెచ్‌ఒ, ఎంఎల్‌హెచ్‌పిఎస్ చంద్రకళ, ఝాన్సీ, సులోచన, రజిత, గిరిజ, కృష్ణవేణి, పద్మావతి, షేక్షావలీ, మద్దిలేటి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సిహెచ్‌ఒలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్


పేదల కష్టాలు తీర్చడంలో ఆనందం

- సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు రంగయ్య

- వృద్ధ దంపతుల తాత్కాలిక గృహ నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పేదల కష్టాలు తీర్చడంలో ఆనందం ఉందని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు రంగయ్య తెలిపారు. నందవరం మండలం హాలహర్వి గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన మాల ఈరమ్మ, మాల ఓబులేసు దంపతులు ఉండడానికి చోటు లేక ఎండ, వానకు తడుస్తుండగా వారిని చూసి పెద్దలు సర్పంచి అదే దళిత కాలనీలో పాత ఇంటిని నివాసం కోసం ఏర్పాటు చేశారు. వర్షానికి పూర్తిగా కారడంతో ఎప్పుడు కూలిపోతుందో అని పెద్దలు ఇంటిని ఖాళీ చేయాలని, ఏదైనా ప్రమాదం జరగవచ్చని ముందుగానే ఖాళీ చేయించారు. ఇద్దరికీ వయస్సు మీద పడడం, అందులో ఓబులేసుకు పూర్తిగా కాళ్లు పోవడంతో కుటుంబ పోషణ కష్టతరమైంది. చాలా రోజుల నుంచి మంత్రాలయంలో దేవాలయాల దగ్గర యాచిస్తూ జీవనం గడిపేవారు. ఈ మధ్య కాలంలో ఇద్దరి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో వారు తలదాచుకోడానికి చోటు లేక నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కాలం గడుపుతున్నారు. విషయం సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు రంగయ్య దృష్టికి రావడంతో హుటాహుటిన హాలహర్వి గ్రామానికి వెళ్లి పరిస్థితి చూసి వేరే వారి ఖాళీ స్థలంలో తాత్కాలిక నిర్మాణానికి సర్పంచి తిమ్మప్ప సమక్షంలో గురువారం ఆర్థిక సహాయం అందించారు. వారి బాధ్యతను తాను తీసుకుంటానని వారికి భరోసా కల్పించారు. వికలాంగులైన వృద్ధులు రంగయ్యను చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రతి కుటుంబానికీ పెద్ద కొడుకుగా అండగా ఉంటానని రంగయ్య హామీ ఇచ్చారు. గ్రామస్తులందరూ రంగయ్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ నాయకులు రాజోలప్ప, రాయలసీమ అధ్యక్షులు పరమేష్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న సమతా సైనిక్ రాష్ట్ర నాయకులు రంగయ్య

ఇంటర్‌లో సత్తా చాటిన విద్యార్థి అఖిల

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని బైచిగేరి గ్రామానికి చెందిన ఎం.అఖిల ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల్లో రాష్ట్రస్థాయి టాపరుగా నిలిచారు. అఖిల 953/1000 మార్కులు సాధించారు. విషయం తెలుసుకున్న అంబేద్కర్, జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం అఖిలను సన్మానించారు. సొసైటీ సభ్యులు నవీన్ మాట్లాడుతూ... ఒకప్పుడు చదువు లేని రోజుల్లో ఎస్సీ, బీసీలు వెనుక పడిపోయారని, వారికి చదువు కచ్చితంగా కావాలని.. నిరుపేదలు చదువుకోవాలని.. ప్రభుత్వం ఆ బాధ్యతను తీసుకోవాలని.. మురికివాడలో పిల్లలు చదువుకోలేరని.. వారికి కావాల్సిన సదుపాయాలు హాస్టల్లో, ప్రభుత్వ బడులు, ఉచిత విద్య ప్రభుత్వం ఇవ్వాలని అంబేద్కర్ చెప్పారని అన్నారు. నేడు పేదలకు విద్య అందుతోందని, అంబేద్కర్ చెప్పినందుకే పిల్లలకు చదువు అందుతోందని తెలిపారు. సొసైటీ సభ్యులు విద్యార్థి అఖిలకు రూ.5 వేల నగదు అందజేశారు. ఉన్నత చదువులు చదవాలని, సొసైటీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నవీన్, ఖాసీం, ఘోర హుస్సేని, విజయ్, ఫిలిప్, అశోక్, శేఖర్, ఆనంద్, వినోద్, సామ్యేల్, గ్రామ పెద్దలు ప్రధానోపాధ్యాయులు హనుమన్న పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



తాళిబొట్లు, వెండి మెట్టెలను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

బంగారు తాళిబొట్లు వితరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని అలసందుగుత్తి గ్రామానికి చెందిన వీరాంజనేయులు, నాగేంద్ర నూతన వధూవరులకు బంగారు తాళిబొట్లు, వెండి మెట్టెలను వివాహ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి గురువారం అందజేశారు. వివాహం చేసుకునే పేద జంటలకు ఉచితంగా తాళిబొట్లను పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందని ఆయన తెలిపారు. వైసిపి యువజన అధ్యక్షులు నల్లా రెడ్డి, రామలింగేశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి

- వైసిపి పట్టణ అధ్యక్షులు నాగేశప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో వైసిపి పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప కోరారు. గురువారం వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక సూచనతో వైసిపి పట్టణ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పట్టణ కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప అధ్యక్షత వహించారు. పట్టణంలోని ముఖ్య నాయకులు, విభాగాల ఇన్‌ఛార్జీలు, యువజన నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యాచరణ, ప్రజల్లో ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ వైసిపి విధానాలను తెలియజేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత మోడీ, బాబు కూటమి ప్రభుత్వం ప్రజలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని విమర్శించారు. బీసీలకు న్యాయం చేయకుండా, నిరుద్యోగులకు భృతి ఇవ్వకుండా, పింఛన్లను తగ్గించి, ప్రజలపై నిత్యావసరాల భారం మోపే విధంగా పాలన కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ... పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి అసలైన సమాచారం అందించాలని, వైసిపి నిబద్ధత, ప్రజా సంక్షేమంపై మక్కువను తెలియజేయాలని కోరారు. బూత్ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు కార్యకర్తలు మరింత చురుకుగా పని చేసి, పార్టీ గెలుపు కోసం నిబద్ధతతో కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు, పట్టణాభివృద్ధికి అవసరమైన చర్యలు, స్థానికంగా తీసుకోవాల్సిన నిర్ణయాలపై సూచనలు, అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పార్టీ పట్ల నమ్మకం, నాయకత్వంపై విశ్వాసంతో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశప్ప

'వేదవతి'కి నిధులు కేటాయించాలి

- వేదవతి ప్రాజెక్టు సాధన సమితి కన్వీనర్ ఆదినారాయణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని వేదవతి ప్రాజెక్టు సాధన సమితి కన్వీనర్ పెద్దహరివాణం ఆదినారాయణ కోరారు. గురువారం మండలంలోని ఢణాపురం గ్రామంలో రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యంత వెనుకబడిన ఆలూరు ప్రజలు తాగునీటికి తుంగభద్ర దిగువ కాలువపై ఆధారపడ్డారని తెలిపారు. గూళ్యం సమీపంలో ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని 8.5 టిఎంసిల సామర్థ్యంతో నిర్మిస్తే 80 వేల ఎకరాలకు సాగునీరు, 10 లక్షల మందికి తాగునీరు అందుతుందని చెప్పారు. వేదవతి ప్రాజెక్టుతో నల్లరేగడి భూములు కలిగిన హాలహర్వి, ఆలూరు, హోళగుంద, చిప్పగిరి, ఆదోని, కౌతాళం మండలాలకు తాగునీటితోపాటు 80 వేల ఎకరాలకు సాగునీరు అందించి రూ.2 వేల కోట్ల అంచనాలతో మంజూరు చేసిన వేదవతి ప్రాజెక్టు నత్తనడకన ఎందుకు సాగుతుందని నిలదీశారు. ప్రధానంగా ప్రాజెక్టుకు కావాల్సిన భూసేకరణ కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని, నిర్వాసితులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరారు. బడ్జెట్ నిబంధనల్లో సవరణలు చేసి అంచనా మొత్తం 25 శాతం నిధులు విడుదల చేయాలని తెలిపారు. నిబంధనల ప్రకారం 8 టిఎంసిల నీటిని సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా అలుగు నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు. సుమారు 80 వేల ఎకరాల ప్రతిపాదిత ఆయకట్టుకు సాగునీరు, అన్ని గ్రామాలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న నిధుల కేటాయింపు కోసం ఆలూరులో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

ఎస్సీల చిరకాల వాంఛ నెరవేర్చిన బాబు

- ఎస్సీ వర్గీకరణపై టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - ఆదోని

ఎస్సీ వర్గీకరణతో మాదిగల చిరకాల వాంఛ నెరవేర్చిన ఘనత చంద్రబాబుకే దక్కిందని ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయరాం, మండల నాయకులు మదిరే వీరేష్, న్యాయవాది రామకృష్ణ తెలిపారు. గురువారం టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషిని కొనియాడారు. కూటమి ప్రభుత్వంతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమని మరోసారి చంద్రబాబు రుజువు చేశారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తోనే విద్య, ఉద్యోగాల్లో సమాన రిజర్వేషన్లకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని తెలిపారు. నాయకులు హనుమంతు, నాగరాజు, వలమన్న, బాలరాజు, శంకర్, నారాయణ ఉన్నారు.



కేక్ తినిపించుకుంటున్న నాయకులు



డిఎల్‌పిఒకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కమేలా వేలంపాట రద్దు చేయాలి

- డిఎల్‌పిఒకు కటిక కార్మికుల వినతి

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం పంచాయతీలో ఇటీవల నిర్వహించిన కమేలా వేలంపాటను రద్దు చేయాలని కటిక కార్మికులు కోరారు. గురువారం డిఎల్‌పిఒ నూర్జహాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కటిక వృత్తి కార్మికులు ఖాసీం వలీ, మహబూబ్, ఇబ్రహీం, గౌస్ మొద్దీన్, వాసీం, జాంగీర్ షబ్బీర్ మాట్లాడారు. పెద్దకడబూరు, మంత్రాలయం, కోసిగి మండలాల్లో లేని నిబంధన కౌతాళంలో (చికెన్ అంగడిపై రుసుం) నిబంధన అమలు చేయడంతో నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ తరఫున కమేలాకు స్థలం కేటాయించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. సంబంధిత అధికారులు తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

శ్రీమఠంలో ఘనంగా స్వర్ణ పల్లకోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం వైభవంగా సాగింది. గురువారం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న భక్తులు, స్వర్ణ పల్లకి సేవ చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించారు. మంగళ హారతులు ఇచ్చి, అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు సేవాదారులకు శేష వస్త్రం అందజేసి ఆశీర్వదించారు.

స్వర్ణమయమైన రాఘవేంద్రుని బందావనం

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్రుని మూల బృందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకొని నైవేద్య సమర్పణలో మంగళ హారతులు ఇచ్చారు.



స్వర్ణ పల్లకోత్సవం నిర్వహిస్తున్న పండితులు